#  కీటకశాస్త్రం 

మా జువాలజీ లెక్చరర్ సీతాకోకచిలకలాగా వుంటుంది. పేరు మొదటి రెండక్షరాలే. వన్నెవన్నెల చీరలూ, డ్రస్సులూ, ఆఫ్రికన్ హెయిర్‌డూ నించి, అమెరికన్ మోడరన్ హెయిర్‌డు నించి, బాబ్డ్, వాల్జడ, కీల్జడ, నెత్తి మీద పెద్ద గుండ్రని కొప్పు వనవాసి రామునిలాగా, బర్మాముడి, వేలుముడి, చివరికి కొప్పుగూడా పెట్టి కొప్పు గొలుసులు, గూబ్బా వీలు, చెంపసరాలూ, కెంపుల బిళ్ల గూడా వాడుతుంది. పాంటూ షర్టూ, షేర్వాణీ వాడుతుంది. కాటుక గీరలు, రెప్పల మీదా రంగు, లిప్‌స్టిక్, రెడ్‌ఛీక్ వాడుతుంది. రకరకాల బొట్టుబిళ్లలు పెట్టుకుంటుంది. సహజంగానే దిద్దినట్టుంటాయి కనుబొమలు. హైహీల్సూ, ఆకుచెప్పులు, చెడావులు, అన్ని ఫుట్‌వేర్ వాడుతుంది. మాచ్ అయే గాజులు, మెల్లోస్టడ్ చెయిన్సూ, లాకెట్సూ వుంటాయి. అంటే శ్రద్ధగా సౌందర్య పోషణ చేసుకుని, పూలతీగలాగా నాజూగ్గా వుంటుంది. ఆవిడ చికాకు పడటం గానీ, బొమ ముడివేయటం గానీ యెవరూ చూచి యెరుగరు. బ్యూటీ పార్లర్‌కి వెళ్లదంటారు. అనారోగ్యంగానూ కనబడదు. ఫిట్ అనే పది నిమిషాల వ్యాయామం దూరదర్శిని చూస్తూ చేస్తుందంటారు. శలవు పెట్టదు. శలవులు వృధా చేసుకోదు. స్కిప్పింగ్, స్విమ్మింగ్, స్కేటింగ్, రోలర్ స్కేటింగ్, రికార్డు వింటూ డాన్సు చేస్తుంది. ఫ్రెండ్లీగా వుండి, నవ్వుతూ నవ్విస్తుంది. పాఠం గూడా ఆమెవలెనే ఆకర్షవంతంగా వుంటుంది. బొమ్మలేసి, లైట్ అండ్ షేడిచ్చి చూపుతుంది. పెన్సిళ్ల ముక్కలు యెన్ని విధాలుగా చెక్కి వుంచుకోవాలో చూపుతుంది. బొమ్మలు వేయటానికి రెడీగా వుంచుకోవాలిట ఒక పెట్టెలో. ఆ జువాలజీ విద్యార్థినుల సంఖ్యాబలం హెచ్చింది. సెంట్ వ్యాపిస్తున్నదంటే లెక్చరర్ మొదలైందని అర్థం.

''కీటకాల మీద ఒక పరిశోధకుడు పుస్తకం వెలువరించాడు. ఆయన ఆచర్య బిరుదు పొందేప్పుడే పరిశోధన మీద బొమ్మలు కీటకాలు సేకరించారు.

కొన్ని చదివి, ఆ పుస్తకంలో పేర్కొన్నవికాక యింకా మీకు కొత్త కీటకాలు తెలిసినా, సేకరించగలిగినా, వాటిని గురించి వ్రాసి, బొమ్మలేసి పంపమని అన్నారు పీఠికలో. ద్వితీయ ముద్రణలో మీ విషయ సేకరణ పడుతుందిట. అడ్రసిచ్చారు గ్రంధకర్త. సత్యం తెలుస్తుంటే అన్ని సబ్జక్ట్సూ యింటరెస్టింగ్‌గానే వుంటాయి. చరిత్ర, భూగోళం, సైన్సూ, జ్యోతిశ్శాస్త్రం, ఖగోళశాస్త్రం, సంఖ్యాశాస్త్రం అన్నీను. లలితకళలూ అంతే. జువాలజీ గూడా యింటరెస్టు రేపుతుంది. కీటకాలూ మనుషులల్లేనే చాలా రకాలు. చాలా రకాల మనస్తత్వాలు. ఒంటరిగా జీవించేవీ, గుంపులుగా జీవించేవీ, మంచివీ, చెడువీ గూడా వున్నాయి''.

ఒక విద్యార్థిని లేచి నిలబడింది. యేమిటన్నట్లు చూసింది లెక్చరరు.

'పురుగుల్లో మంచేమిటి మేడమ్? దాని పేరే పురుగు. వూహకందలేదు. హీన అనే అర్థమొస్తుంది. పురుగును దులిపేసినట్లు అని వాడతాము. పురుగును చూసినట్టు అని వాడితే, పనికిరాని అనే అర్థం వస్తుంది'' అన్నది విద్యార్థిని.

''సిడౌన్ యంగ్ లేడీ, వానపాము పురుగే. రైతుకి చాలా మేలు చేస్తుంది సాధుజాతి. భూమినీ నేలనూ తేమ ప్రదేశాన్నీ, తడినేలనూ, నీరున్న నేలనూ తొలిచి బోలుగా వుంచుతుంది. మొక్కలు సులభంగా యెదుగుతాయి. పట్టుపురుగు తాను బాధపడుతూ పట్టు దారాన్నిస్తుంది. యెంత వ్యాపారం జరుగుతున్నది దాని వల్ల? తేనెటీగలు తమ కోసమే శ్రమించి తెలివిగా గళ్ళుగళ్ళుగా తుట్టె నిర్మించి ఆగళ్ల నిండా మకరందం నింపుతాయి. పువ్వుల మధ్య నించి తెచ్చినదే ఆ మకరందం. అమాసా, పున్నమి, టైం చూసి వాటిని తోలేసి, అదీ అంతా నింపాక, అంటే నింపి అవే తాగుతాయన్నమాట. పొగబెట్టిగానీ, మంట వేసిగానీ మనుషులు తరిమేస్తారు. కొంకి కర్రతో తుట్టె తుంచి తెచ్చి కుండలోకి పిండితే తేనె వస్తుంది. తేనె లేని తుట్టెపేరు మైనం. అదీ బాగా వుపయోగమే. బొమ్మలు చేస్తారు. పుస్తకాలు కుట్టే దబ్బనం గుచ్చి వుంచుతారు. వీణలకు మేళం కడతారు. వైద్యానికీ వాడతారు. కారిపోకుండా మూతలకి మైనం రాస్తారు. గాజువస్తువులు తయారు చేసేప్పుడు వాడతారు. ఊదొత్తుల చివరలు ద్రవంలాగా

వున్న మైనంలో ముంచి తీస్తే కొంతమేర పుల్ల, తక్కినది పుల్లకి సుగంధ ద్రవ్యం పూస్తారు. తేనెటీగల పెంపకమని కుటీర పరిశ్రమ వున్నది. తేనె తుట్టె మీద పొడుపు కథ వున్నది. చిటారు కొమ్మన మిఠాయి పొట్లం అంటే తేనె తుట్టె. అచ్చం పొట్లంలాగే కనబడుతుంది. నిండా తేనె, దాని మీద కదులుతూ తేనెటీగలూ, వాటి జోలికి పోతే అవి కుట్టుతాయి. దద్దుర్లూ, బొబ్బలూ మంటా వస్తాయి. చెట్ల కొమ్మలకే గాక తేనెటీగలు పుట్టలో చెట్టు వేరుకీ తుట్టె పెడతాయి. దాని పేరు పుట్టతేనె. యెలుగు వాసన బట్టి, బలమైన గోళ్లతో తవ్వి తుట్టె తీసి లేదా అక్కడే వుండ నిచ్చి తేనంతా పీల్చి తుట్టె వదిలి వెళ్లిపోతుంది. కందిరీగ తడిమట్టి యెర్రనిది తెచ్చి చిన్న యిల్లు కట్టి దానిలో గుడ్లు పెట్టి చిన్న కన్నం వుంచి దానిచుట్టూ తిరుగుతూ ధ్వని చేస్తే గుడ్లు యెదిగి పురుగులై దానిలాగే ధ్వని చేస్తూ బైటికొస్తాయి. న్యాయము అంటే మతము అనే అర్ధమున్నది. భ్రమరకీటక న్యాయము అంటే దైవము జీవులనలాగే సృష్టిస్తాడనీ, జీవులలో దైవమున్నాడనీ వాదిస్తారా మతం వారు. దానికి మరోపేరు అగ్నిగుండం పురుగు. కందిరీగలాగా కుడతాడని వాడతారు. పెద్ద బొబ్బా మంటా కొన్నాళ్లుంటుంది అది కుడితే. ఒక తుట్టెలో కేజీ పైనే వుంటుంది మకరందం. దాన్ని వడియగట్టి సీసాల్లో నింపి భద్రం చేస్తారు. ఆయుర్వేద ఔషధం చూర్ణమైతే తేనె కలిపి నాకిస్తారు రోగి చేత. కొంతమంది తేనె కంట్లో వేలితో రాచి మలినం పొగొట్టుకుంటారు. నిద్రపట్టాలనీ తేనె రాస్తారు కంట్లో. లాభాలూ వున్నాయి మరి''. మరొక విద్యార్ధిని లేచి నిలబడింది.

''యేమిటి యంగ్ లేడీ?''

''లాభమేమో గానీ మేడమ్ చెదలు పట్టాయంటే మేడమ్, పుట్టలకు పుట్టలు పుస్తకాలు నాశనం. కర్ర సామాను, కలప అల్మర్లు అన్నీ తినేస్తాయి. అవట్లా ఇంక్రీజ్ కావటానికేవి సాయపడతాయో అవెట్లా చస్తాయో తెలియదు. హాని బాగానే చేస్తాయి''.

''అఫ్‌కోర్స్ యంగ్ లేడీ సిడౌన్. చెప్తా''

స్టూడెంట్ కూచుని తలవంచుకున్నది.

''మొదటే చెప్పానే మనిషులెన్ని రకాలో అన్ని రకాలూ పురుగులున్నాయి అని. తిన తిండీ, వుండ గూడూ, కట్టుకోను గుడ్డా పనీ వున్న మనుషులే, హీనంగా చూడబడుతున్నామని తలచి, తాము గొప్పవారమేనని నిరూపింపదలచి, వాయునౌకను మళ్ళించి దాని సాయంతో డబ్ల్యుటిసి అనే వ్యాపార కేంద్ర భవనాలను నేలమట్టం చేశారు గాదా. అలాగే చెదలూనూ. తామేమీ తీసిపోలేదనీ తమకూ వెరవాలని అలా చేస్తాయి. తర్వాత రగుల్కొన్న యుద్ధం లాగే ఆ పుట్టలనూ నశింపజేయటానికి మార్గాలు చూస్తారు. పొడుపు కథలూ యింటరెస్టింగ్‌గానే వుంటాయి. ఇంతుందో లేదో యిల్లెక్కి పిండికొడుతుంది అంటే'' అని నవ్వుతూ చూసింది మేడమ్.

''నుసి పురుగు మేడమ్''

''గుడ్. అలా వుండాలి. నుసి పురుక్కి నూరు కళ్లు అంటే?''

''జల్లెడ మేడమ్'' మరొక విద్యార్థిని లేచి నవ్వుతూ జవాబిచ్చింది.

''గుడ్. బామియాన్ బౌద్ధ శిల్పాల్ని మందుగుండు సామానుతో చితాచితలు చేశారు. అవి శిల్పాలు. విగ్రహాలు కాదే. జలగ పురుగే. ప్రాచీనకాలంలో, శరీరం మీద వ్రణం చేస్తే చెడు రక్తం తీసేయటానికి, ఊబకాయం తగ్గించటానికీ జలగల్ని పట్టించేవారు. అవి రక్తం పీల్చేస్తాయి. నల్లులూ అంతే మానవ రక్తం మీదే బతుకుతాయి. జలగలాగా పట్టాడంటారు. విడదీయాలని లాగితే సాగుతాయి గానీ వూడిరావు. సున్నంపైతేట నీరు సున్నం. నీళ్లలో కలిపి ఆ నీరుగానీ వాటిమీద పోయగానే వూడి కిందబడతాయి. ఆటే విషంలేని పాముని తుట్టపురుగంటారు. పాము చర్మాలు అందమైనవి అమ్ముతారు. డియన్ఏ నిరూపించటంలో పాములను వాడారు. హైహీల్సు బెల్టులుగా పాము చర్మం వాడుతారు. పాములను పట్టి దవడలు నొక్కి విషం పట్టిన ఆయుర్వేద

వైద్యులు కొంటారు. ఆ విషంతో ఔషధం చేస్తారు. వాటిపేరు సన్న మాత్రలు. రోగి బతకడని ఆశలు వదులుకుంటే వళ్లు చల్లబడుతుంటే చివరిసారిగా అవి వాడతారు. కరెంటు లాగా పనిచేసి వేడిని సృష్టిస్తాయి ఆ మాత్రలు. మిణుగురు పురుగులు వినోదమిస్తాయి. అవి యెగురుతుంటే రాత్రిళ్లు రెక్కల కింద వెలుతురులాగా మెరుపు కనిపిస్తుంది. వానాకాలంలో తడిసిన పచ్చగడ్డి మీద ఆరుద్ర పురుగులు కానవస్తాయి. ఇపుడు కానరావటం లేదేమో. పద్యమున్నది. ఆరుద్ర పురుగెరుపు అని అవి హాని చేయవు. చిన్నవే యెర్రని పట్టు లాంటి చర్మం ముట్టుకుంటే ముడుచుకుపోతాయి. మెత్తగా వుండి మొఖమల్ శాటిన్‌లాగా వుంటాయి. కీచురాయి బురదలో తిరుగుతూ పెద్దగా అరుస్తుంది. తొలవటం గూడా దాని స్వభావం. కుమ్మరి పురుగని గూడా అంటారు. రెక్కలుంటాయి. కొద్ది యెత్తు యెగురుతుంది. ఇంద్రుడు కుమ్మరి పురుగై కర్ణుని తొడకింద చేరి కొరుకుతూ తొలుస్తుంటే రక్తం కారి ప్రవహించింది. కర్ణుని తొడమీద తల వుంచి నేలమీద పడుకుని వున్నాడు పరశురాముడు. కర్ణునికి అస్త్ర విద్య నేర్పుతున్నాడు. వెచ్చని రక్తం తాకగానే మెలకువ వచ్చి లేచి చూచాడు. చూస్తుంటే కుమ్మరి పురుగు పాకిపోతూ కంటబడింది. ''యెవరు నువ్వు? బ్రాహ్మడికింత సహనం వుండదే? వేషం వేసి నా వద్ద చేరి అస్త్ర విద్య నేర్చావా?'' అని తీవ్రంగా ఆలోచించి, ''బహుశా అధర్మం గెలిపించాలని నీ వుద్దేశమై వుండొచ్చు. కాని యెంత బాధ భరించావు శిష్యా! విశ్వ వ్యాప్తి జగద్గురువు పరిపూర్ణుడు. ధర్మాన్నే గెలిపిస్తాడనే జ్ఞానం నీకు లేదని అర్ధమైంది. ఇంక నిర్గమించు. మరపు వస్తుంది విద్య. వ్యర్ధమౌతుంది నేర్చినది'' అని పంపేశాడు కర్ణుని.

''అలాగే నహుషచక్రవర్తి, ఇంద్ర పదవిచే మతిపోయి, బ్రహ్మర్షులు లాగే రథంలో యింద్రాణి యింటికి వెళ్లి తెచ్చుకోవాలని చూచాడు. ఇంద్రాణి యింద్రుని భార్య. తానింద్రుడే. తనతో జీవించాలి. ఇంద్ర పదవిని గౌరవించాలని ఋషులు బండి లాగటానికి ఒప్పుకున్నారు. రథంలో వున్నప్పుడు మనిషే నహుష. అగస్త్యమహర్షి మెల్లిగా నడుస్తుంటే, రథం కదలటం లేదని అసహనంతో 'సర్ప!

సర్ప!'' అని కొరడా విదిలించి కొట్టాడు నహుష. ''నడు. నడు'' అని అర్థం. అగస్త్యుని మొహానికి కొరడా చివర తాకి చీరితే రక్తం వుబికింది. 'సర్పోభవ!'' అన్నాడు వెనక్కు తిరిగి. సర్పము అంటే పాము. అంతే యింకేమున్నదీ జెర్రిగొడ్డై నహుష జరజరా జారి కిందబడి పాకి వచ్చి, అగస్త్య మహర్షి పాదాలకు చుట్టేశాడు. ''మహర్షీ. కంటి పొరలు పోయినై. పొగరు దిగింది. బుద్ధొచ్చింది. పాముగా మారాకే తెలివి గలిగింది. మనిషిగా వుండగా కన్ను మిన్ను కానరాలేదు. పాము తెలివిగలదని తెలిసింది. నేను పదవీచ్యుతి పొందాలని ప్రేరణ జరుగుతున్నదని తెలిసీ జయించలేకపోయాను మహర్షీ. ఇంద్రాణి అంటే పరమేశ్వరి అని పామయాకే తెలిసింది. ఇప్పుడన్నా తెలిసింది. చింత లేదు. పదవి మీదా లేదు. నీటి మడుగులో వుండమన్నారు మహర్షి. వుంటాను. నన్ను మన్నించి, పూర్వజన్మ జ్ఞానం వుండేట్టూ వరం ఇవ్వండి. యెన్నాళ్లుండాలి? ముక్తి యెప్పుడు యెలా వస్తుంది? నహుషుడి నెప్పుడౌతానూ చెప్పండి మహర్షీ'' ఆ మాటలో నవ్వూ బాధా దాగి వున్నాయి.

తక్కిన ఋషులు అగస్త్యుని వంక చూశారు. అగస్త్య మహర్షి తన మొహాన చిందిన రక్తాన్ని చేతితో తుడుచుకుంటూ నహుషుడితో అన్నాడు. ''నహుషా! సత్యం గురించి గొప్పతనం వెల్లడించావు. ద్వాపరంలో పాండవులడవుల పాలై, దాహంతో నీటి స్థావరాన్ని వెతుకుతూ వస్తారు. నలుగురు తాము చూసినవి యేమిటో నీకు విశదీకరించలేక నీళ్ల తాగిపడిపోతే, ధర్మజుడు తమ్ములను వెతుకుతూ వచ్చి దాహశాంతి చేసుకోవాలని ప్రయత్నిస్తే నీటిలో దాగివున్న నీవు ''నీ తమ్ములు తాము చూచిన వేమిటో చెప్పలేక నీళ్ల తాగి పడిపోయినారు. నువ్వైనా చెప్పాలి. చెప్పక నీరు తాగితే నీవూ పడిపోతావు'' అనగానే ''యేమి చూశారో చెప్ప''మని ధర్మజుడడిగి విని తాను విశదీకరించగానే, నీ శాపం పోతుంది. నహుషవై కనబడతావు. ధర్మజునికి దాహం తీరాక ''వీరిలో ఒకరిని బతికిస్తాను. యెవరు కావాలి?'' అంటే సహదేవుని పేరు చెప్తాడు. ''అదేం ధర్మజా! బలశాలి భీమ, సమర్థుడర్జునుడుండగా సహదేవుడెందుకు?''

అంటావు. ''కుంతీపుత్రులలో నేను బతికి వున్నాను. మాద్రీపుత్రులలో ఒకడు బతికి వుండాలి. అది ధర్మం'' అంటాడు ధర్మజుడు. సంతోషించి నలుగుర్నీ సజీవుల చేసి యిచ్చి నీ కథ చెప్పగానే పూర్వపు నహుష చక్రవర్తివౌతావు'' అని పంపేశాడు. విద్యార్థినులు చప్పట్లు కొట్టి ''చాలా బాగున్నది పురుగుల కథ మేడమ్'' అన్నారు.

''అందుకే పురుగులు హీనమైనవి కావు. మనుషులల్లేనే పురుగులూ కొన్ని అల్పాయువులూ, కొన్ని దీర్ఘాయువులు. దీపపుపురుగులు దీపం చుట్టూ చేరి మంటకి చచ్చి పోతాయప్పుడే. పడియుండదె పేర్మి బాము, పదినూరేండ్లున్ అన్నాడు కవి. కొన్ని కీర్తినీ డబ్బునూ తెచ్చిపెడతాయి''.

''అదెలా సాధ్యం మేడమ్'' అన్నారందరూ.

''నోబెల్ బహుమానం వినే వుంటారు'' అని అందర్నీ చూచింది. కొంతమంది నిలబడి అడిగారు ''తెలియదు మేడమ్ చెప్పండి తెలుసుకుంటాము. పురుగులకి బహుమానానికీ యేమిటి సంబంధం? నోబెల్ జువాలజీ చదివాడా?'' అని కూర్చున్నారు.

''లేదు. కూలీలు యెర్రనెండలో, ఆకలితో కొండరాళ్లు పగలగొట్టటం చూసి ఆల్ఫ్రెడ్ నోబెల్ ద్రవించి పోయి, పేలుడు పదార్థం కనిబెట్టి దానిని కొండలో చిన్నగుంట చేసి కూరి మందు రాసిన తాడు కట్టి, దూరానికి కిందికి వెళ్లి ఆ ఫ్యూజ్ ముట్టిస్తే అది కాలుతూ వెళ్లి దాచి వుంచిన పేలుడును తాకగానే, పేలి కొండపగిలి రాళ్లు దొర్లుతూ కిందికి వస్తాయి. వాటిని విడదీసి చిన్నా పెద్దా చేసి కొన్నిటికి మంచి ఆకారం తెప్పించి రైలు పెట్టెల కెత్తితే, రైలు గూడ్సులాగానన్నమాట ఆ రాళ్లను కావాల్సిన చోటికి చేరుస్తుంది, కట్టడాలకు వాడతారు. ఆ పేలుడు మందు బాగా అమ్ముడు పోయి అపారంగా ధనం వచ్చింది. దాన్ని కోశంలో వేసి దాని మీద వడ్డీ, శాంతి బహుమానంగానూ, వైద్యంలో ప్రజోపయోగమైన ఔషధం కనిబెట్టినవారికీ, సాహిత్యంలో బెస్ట్ సాహిత్యానికీ,

రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రాలలో కొత్తది కనిబెట్టినవారికీ యిమ్మని ఒక ట్రస్టునూ, కమిటీనీ యేర్పాటు చేశాడు నోబెల్. మేరీ క్యూరీ, భర్త రేడియం కనిబెట్టి కాన్సరు నిర్మూలన, వైద్య రంగంలోనూ పనికి వస్తుందని చూసి బహూకరింపబడ్డారు. ఐన్స్టైన్, సివిరామన్, మదర్ థెరిసా అలా యెందరో ఆ నోబెల్ బహుమానం పొందారు. కవి రవీంద్రనాథ్ సాహిత్యానికి పొందారు. ఇపుడు ఆర్థిక శాస్త్రానికీ యిస్తున్నారు. రాస్ దొర మలేరియా అనే జ్వరం దోమకాటు వల్ల వచ్చి వ్యాపిస్తూ మనుషులను పనికిరానివారుగా చేస్తున్నది. పెద్దపెద్ద పనులు ఆగిపోతూనష్టపోతున్నాయి. కూలీలు జ్వరంతో లేవలేక పోతున్నారు అని అంటే యే దోమా? చాలా రకాల దోమలున్నాయే? నిరూపించాలి. నివారణ, కంట్రోల్ చేయటం, దానికి ఔషధం కనిబెట్టాలి. రాస్ దొర బాట సుకరంగా లేదు. వుద్యోగం చేయాలి తప్పదు. పరిశోధనకి శలవు కావాలి. శాంక్షన్ కాదు. అయినా ఓర్పు చూపాడు శ్రమించాడు. నిరూపించాడు. దోమల్ని జిగురు మీద వాలేట్టు చేసి పట్టి, యే దోమ మలేరియా వ్యాపింప జేస్తున్నదో యెలా పుట్టి పెరిగి అసంఖ్యాకంగా వస్తున్నాయో బొమ్మలు వేసి చూపాడు. ఒకడు జ్వరపడితే వానివి కుట్టి రక్తంతో పొట్ట నింపుకొని వెళ్లి ఆడదోమకు గర్భం తెప్పించి మగది చస్తుంది. గుడ్లూ, లార్వా, పెరగటం, కీటకంగా కావటం, ఆ దోమలు కుట్టిన వారికి మలేరియా ఇన్‌జెక్ట్ అయి తొండంతో కుట్టి లోపలికి వ్యాధిని ప్రవేశపెడుతుంది. ఆ మలేరియా వున్న దోమలు అసంఖ్యాకంగా తయారవుతాయి. పరిసరాలు ప్రదేశాలు శుభ్రంగా వుంచాలి, నిలవ నీరు, మురుగు నీటి మీద క్రిమి సంహారక మందు, పొడిగానీ, ద్రవరూపంలోగానీ తయారు చేసి చల్లాలి. కూలీలకు మందులు ముందుగానే దగ్గరుండేట్టు అందివ్వాలి. పనిలోంచి రాగానే కప్పు పాలు యివ్వాలి. ఇపుడు ఇన్‌జెక్షన్లూ వచ్చాయి. మలేరియా తగ్గించేందుకు. కార్పొరేషన్ వారూ, మున్సిపల్ వారూ, హైజీన్ చూసేవారూ, పనివారిని యేర్పాటు చేసి క్రిమి సంహారక మందు వాడటం నేర్పారు. పనామా కెనాల్ పని ఆగిపోతుంటే రాస్ దొరను పిలిపించారు. ఆయన

కూలీలను జ్వరపడకుండా భద్రతలు తీసుకుని పని త్వరత్వరగా జరిగేట్టు చేయగలిగాడు. ఆయన శ్రమకు, దయకు, ఔదార్యానికీ ఆయనకు వైద్యరంగంలో చేసినపరిశోధనకు నోబెల్ బహుమానమిచ్చారు. సికోనా, క్వినిన్, రెసోచిన్ వంటివి కనిబెట్టారు. భాగ్యశీలురు మస్కిటో నెట్ వాడతారు. కీటకాల్లోనే మంచివీ చెడువీ వుంటాయి. సాలె పురుగు వంటిమీద పాకితే లక్ష్మీప్రదమని సాలెపురుగును చంపరాదంటారు. శేషుడు, వాసుకి, అనంతుడు, నాగుబాము వంటివి దేవతాపాములైతే, కాళీయా, కర్కోటక, తక్షక దుష్టజాతివి. తాచు తెల్ల తాచు, యెర్ర తాచూ పగతీర్చుకుంటాయని కథలున్నాయి. కర్కోటకుడు, అడవులలో ఆకలితో తిరుగుతున్న నలుని కాటేసి విరూపుని చేశాడు. అది నీ మంచికే అంటాడు పైగా. మందర పర్వతం కవ్వంగా వాడి చలికి అమృతం కోసం శ్రమిస్తుంటే వాసుకి తాడుగా చుట్టుకుని దేవదానవులకు సాయపడ్డాడు. తన తండ్రి పరీక్షన్మహారాజును తక్షకుడనే పాము కాటువేసి చంపాడని తెలిసి'' అని చెప్తున్నది లెక్చరర్.

''దేనికి కాటువేసి చంపాడండీ తక్షకుడు? రాజు చూడక తొక్కాడా తక్షకుని'' నా ఫ్రెండ్ నవనీతం చీకట్లో చూడక పాముమీద పాదం వేస్తే అది వెంటనే కాటేసిందండి. కుబుసం విడిచిననాడు మరీ విషం యెక్కువగా కక్కుతుందిటండీ. ఆకలి మీద వుంటుందిట. కుబుసం వల్ల కళ్ల సరిగా కానరాక ఆహారం సంపాయించుకోలేక అవస్థపడుతుందిట'' అన్నది దేవయాని.

''వెరీ గుడ్. చూశావా చాలా తెలుసు నీకు. సిడౌన్ యంగ్‌లేడీ. పరీక్షిత్తు తొక్కలేదు. వేటకెళ్లి అలిసి దాహంతో ఆశ్రమం వేపు వెళ్లి తపస్సులో వున్న ఋషిని దాహమిమ్మని అడిగితే ఋషిపలకలేదుట. ఆయనపేరు శమీక. దొంగ తపస్సు, రాజుగోడు వినడా అనుకుని, ఆదాపులనే చచ్చిపడివున్న పాము నొకదానిని చూచి వింటి చివరితో దానినెత్తి ఋషిమెళ్లో వేసి వెళ్లిపోయడా రాజు. కొంత సేపటికి మిత్రులతో శృంగి అనే కొడుకు వచ్చి అది నిజమైన బతికున్నపామని తలచి, యేడ్చి కోపించి, బడుగైన శృంగి నా తండ్రి మెళ్లో

యీ పామును వేసిన వాడెవరగుగాక తక్షకుని చేకాటు వేయబడి యేడవరోజున పోతాడు అని శపించి నీరు వదిలాడు. శపించాక అది చచ్చిన పామని గుర్తించాడు. యెవరో అవమానించాలని తన తండ్రి మెడలో వేశారని ఆగ్రహించాడు. తాను ముట్టుకోలేదు. తీయలేదు. శమీహుడు తపస్సు చాలించి తీసి దూరంగా పారేశాడు. అక్కడున్న ఋషికుమారులు చెప్పగా అంతా విన్నాడు. వచ్చిందెవరో గూడా యోగదృష్టితో చూచి తెలుసుకున్నాడు. ఆయనకు చాలా బాధ కలిగింది. యేడ్చి వున్న శృంగినీ చూచాడు. ''అయ్యో! నాయనా శృంగీ చాలా తప్పు చేశావు. రాజు దాహమిమ్మని అడిగితే పలకకపోతే ఆ బాధలో తానేం చేస్తున్నదీ తెలియక చచ్చినపాముని నా మెళ్లో వేసి వెళ్లి పోయాడు. ప్రజలను కాపాడే ప్రభువును శపించి, అరాచకాన్ని ఆహ్వానించావు. అంతేగాక పరీక్షిన్మహారాజు తల్లిగర్భంలో వుండగానే గురుపుత్రుడు వదలిన ''అపాండవమగుగాక అని అస్త్రం వదిలితే, దానిచే ఛేదించబడి చచ్చికిందబడితే ఆత్మస్వరూపుడు కృష్ణపరమాత్మ పరీక్షించి చూచి తడిమి బతికించాడు. పరీక్షించాడు గనక పరీక్షిత్తు అని పేరుబెట్టారు. హస్తినాపుర రాజు. పరిహారం కింద నీవే వెళ్లి శపించానని చెప్పి రక్షణ కల్పించుకో రాజా!'' అని చెప్పిరా'' అన్నాడు. కాని శృంగి ''చంపిస్తాడు. వెళ్లను'' అన్నాడు. అక్కడున్న కుమారుల నడిగాడు శమీకుడు. ''నాయనలారా! మీలో యెవరూ వెళ్లరా? భయమేనా? నేనే వెళ్లి చెప్పి రావాలా. అంతేనా' అనగానే ఒక ఋషి కుమారుడు ముందుకు వచ్చి, ''నే వెళ్లి రాజుకి చెప్పి వస్తాను గురూ. విచారం పెట్టుకోకండి'' అన్నాడు.

ఒక టీనేజరు విద్యార్థిని లేచి అడిగింది ''రాజుకి రక్షణ కల్పించారా మేడమ్? రాజు గదా. సామాన్యుడు కాదు గదా. ఈ విధంగానైనా పురాణగాధ వినే అవకాశం కలిగింది మేడమ్''. మేడమ్ సంతోషించింది. ''కూచో వాసుకీ. సంతోషం. ముడిపదార్థం లాగా కాక జువాలజీతో కలిపి మైథాలజీ గూడా నేరుస్తున్నావు. ఋషికుమారుడు వెళ్లి రాజసభలో ధైర్యంగా చెప్పాడు రాజు నుద్దేశించి, ''రాజా! రక్షణ కల్పించుకోమని మా గురువు చెప్పి రమ్మంటే వచ్చాను''

వెళ్లిపోయాడు. రాజు తాను చేసినపని మంచిపని కాదని గ్రహించి పురోహితులను కన్సల్టు చేశాడు. ఒక విధంగా చెపితే, సముద్రంలో ఒంటిస్తంభంపై మేడ కట్టించి దానిలో మంత్రగాళ్లను పెట్టారు. రాజును దీవించి వెళ్లేందుకు ఒక బల్ల వేశారు ఒడ్డుకి. కాపలాదారులుంటారు. బ్రాహ్మలే వెళ్లచ్చు, మరెవరినీ వెళ్లనీయరు. బ్రాహ్మలు దీవించి వస్తారు. రెండోవిధంగా చెప్తే రాజు ప్రాయోపవేశం చేసి గంగలో నిలబడి, శుక యోగి వ్యాసమహర్షి కుమారుడు, భాగవతం పాడటం నేర్పాడు, కనక భాగవతం విని భయం వదలి'' అంటున్నది. ''తక్షకుని కాటువల్లే పోయాడు రాజు?'' అనడిగింది మణి. ''చెప్తున్నా. కశ్యప అనే బ్రాహ్మడు రాజుకొచ్చిన ఆపద విని, రాజును తాను బతికించి పారితోషికం తెచ్చుకుని, దరిద్రం వదిలించుకోవాలని వచ్చి ఒక తిన్నెమీద కూచుని, తనవంతుకోసం చూస్తున్నాడు. తక్షకుడు మారువేషంలో వచ్చి పక్కన కూచుని రాజును కాటు వేయటానికి అవకాశం కోసం చూస్తున్నాడు. లోపలికి పోవాలి కాటువేయాలి. అందర్నీ పోనీయరు. పైగా మేడచుట్టూ మంటలు. వెళ్లటం యెలాగా అని చూస్తూ కశ్యపుని చూచి, ''యెవరు నువ్వు యేం పనిమీద వచ్చి యిక్కడ కూచున్నావు?'' అనడిగాడు.

కశ్యపుడు ''నేను రాజు ఆపద విన్నాను. నేను పాము విషము దింపి రాజును బతికించగలను. అందుకనిక్కడ కూచున్నా'' అన్నాడు. ''తక్షకుడంటే తుట్టపురుగనా నీవూహ?'' అన్నాడు కోపంగా. ''కాదని తెలుసు. అయినా రాజును బతికించగలను'' అన్నాడు ధీమాగా కశ్యపుడు.

''నేనే తక్షకుడను. నా తడాఖా చూస్తావా?'' అని ఛాలెంజ్ చేశాడు తక్షకుడు.

''చూపించు. చూస్తాను'' అన్నాడు కశ్యపుడు.

''అదుగో ఆ పెద్ద మర్రిచెట్టు చూడు దూరాన. దాని మీదో బ్రాహ్మడు ఆకులు కోస్తున్నాడు. పశులున్నాయి'' అని లేచి వెళ్లి వేరు మీద కాటువేసి వచ్చి కూచున్నాడు తక్షకుడు.

చూస్తుండగానే మంటలు లేచి చెట్టును బూడిద చేసి చల్లారాయి. బూడిద కుప్ప మిగిలింది.

''నా ప్రభావం చూడు'' అని లేచి వెళ్లాడు కశ్యపుడు. ఆ బూడిద కుప్ప మీద తన కమండలంలోని నీళ్లు చల్లి, జపించి, మంత్రించి వచ్చి కూచున్నాడు. చూస్తుండగానే చిన్ని మొలక్క లేచి వృక్షమైంది. బ్రాహ్మడు ఆకులు కోసుకుంటున్నాడు. పక్షులు కలకలారావం చేస్తున్నాయి. తక్షకుడు నోరు వెళ్లబెట్టి కాళ్ల బేరానికి దిగాడు. ''కశ్యపా! అది బ్రాహ్మణ శాపం. జరిగి తీరాలి. ఒక బ్రాహ్మడొచ్చి బతికిస్తాడు అనలేదే శృంగి. ధనం కోసం గదూ వచ్చావు. రాజు యిచ్చేదానికి పదిరెట్లు నేనిస్తా. నాతో రా'' అన్నాడు. కశ్యపుడు ''నిజమే ధనం కోసమేగా వచ్చాను'' అనుకుని తక్షకుడిచ్చిన మణులూ, మాణిక్యాలూ, వెండి బంగారాలు తీసుకుని వెళ్లిపోయాడు. ఒక బ్రాహ్మడు, నిమ్మపళ్లు రెండు తీసుకుని లోపలికి వెళ్తున్నాడు. అందులో ఒకటి పుచ్చి పురుగు పట్టింది. రాజును దర్శించేప్పుడు యేమైనా తీసికెళ్లాలి అది ఆచారం. తక్షకుడా చెడిన నిమ్మపండులో దూరి లోపలికి పోగలిగాడు. బ్రాహ్మడు నిమ్మపళ్లు బల్లమీదుంచి దీవించి వెళ్లిపోయాడు. తక్షకుడు లేచి నిజరూపం ధరించి, రాజును కాటువేసి వెళ్లిపోయాడు.

ఇదంతా విన్న రాజు కొడుకు జనమేజయుడు, బ్రాహ్మల సలహా మీద సర్పయాగం మొదలెట్టి పగతీరాలని పాములను హోమగుండంలో పడేయిస్తున్నాడు.

''తక్షకుడూ పడ్డాడా హోమగుండంలో'' అని సువర్చల అడిగింది ఆదుర్దాగా వింటున్నది.

'పడలేదు యంగ్ లేడీ! చెప్తున్నా వినోదం కలుగుతుంది. అనంతుడు పాతాళానికి చక్రవర్తి. అపాయం వస్తున్నదని విన్నాడు. ఉపాయం కనుగొన్నాడు. జరత్కారుడనే మహాముని స్నానానికి వెళ్తే, కొంతమంది వాలఖిల్యాదులు

చెట్టువేరును పట్టుకుని తలకిందులుగా వేలాడుతుంటే, యెలుక ఒకటి వేరును కొరుకుతున్నది. విచిత్రంగా వుండి, జరత్కరుడు ''యెవరు మీరు? యెందుకలా వేలాడుతున్నారు? ఆ యెలుకెందుకలా కొరుకుతున్నది?'' అనడిగాడు.

''మేము నీ పితరులము. కాలుడనే యెలుక మా సత్కర్మలు అయిపోతున్నాయని కొరుకుతున్నాడు. నదిలో కొట్టుకు పోతాము. తిలలూ నీళ్లూ వదిలే సంతతి చివరివాడివి నీవు. నీకు పెళ్లీ లేదు భార్య లేదు సంతానమూ లేదు. మా గతి యింతే'' అన్నారు.

''యేం చేయమంటారు కొట్టుకు పోకుండా వుండగలందులకు?'' అనడిగాడు జరత్కరుడు.

'పెళ్లాడి సంతానాన్ని కనాలి'' అన్నారు.

''నా పేరుగల అమ్మాయి అందితే పెళ్లాడతాను'' అని వెళ్లిపోయాడు. ఇది తెలిసిన అనంతుడు జరత్కరుని కలుసుకుని ''నా చెల్లెలు పేరు జరత్కరి. యిచ్చి పెళ్లి చేస్తా మహామునీ. మీ సంతానం మా నాగజాతిని కాపాడుతుంది'' అని పిలుచుకెళ్లాడు.

జరత్కరుడు భార్యతో అన్నాడు. ''యేనాడు నన్ను నీవు అవమానిస్తావో యెదిరిస్తావో ఆనాడే నిన్ను వదిలి వెళ్లిపోతాను'' వారికి ఆస్తీకుడనే అబ్బాయి పుట్టాడు. ఓరోజు సాయంత్రం సూర్యాస్తమయవేళ జరత్కరుడు భార్య తొడమీద తల వుంచి నిద్రబోతున్నాడు. 'సూర్యాస్తమయమౌతున్నది. లేచి అర్ఘ్యమిచ్చుకోరూ?'' అని లేపింది భర్తను. ఆయన లేచి, ''నేను అర్ఘ్య మివ్వనిదీ సూర్యుడస్తమిస్తాడా? అవమానించావు. యెదిరించావు'' అని వెళ్లిపోయాడు. ఆస్తీకుని అనంతుడు పెంచి ఒడుగు చేయించి విద్య నేర్పించాడు.

''జనమేజయ చక్రవర్తి సర్పయాగం మొదలుపెట్టి నీ మేనమామలనందరిని చంపిస్తున్నాడు. నువెళ్లి ఆ యాగం ఆపేయించాలి ఆస్తీకా. యజ్ఞయాగాదులు చేసేప్పుడు రాజులు బ్రాహ్మలను పూజించి వారడిగినదిచ్చి పంపుతారు. నువు

పుట్టినది ఆ యాగం ఆపించేందుకే'' అని పంపాడు అనంతుడు.

సరీగ్గా ఆ సమయానికి అసలు ద్రోహి తక్షకుడు వచ్చి హోమగుండంలో పడలేదని రాజు అడిగితే, తక్షకుడు ఇంద్రుని ఆశ్రయించి కాపాడమని ఆయన సింహాసనానికి చుట్టుకుని వుంటే, బ్రాహ్మలు ''సహేంద్ర తక్షకాయ స్వాహా'' అని పిలుస్తూ హోమం చేస్తుంటే ఇంద్రుని సింహాసనం కదిలి వస్తున్నది తక్షకునితో సహా. రాజు ఆస్తీకుని చూచి లేచి వచ్చి ఆదరసత్కారాలు జరిపి, ''యేమి కావాలి వటూ'' అనడిగాడు.

'' ఈ సర్పయాగం ఆపేయి రాజా. అదే నాకు కావల్సింది. చాలా మంది పనికిరాని వారు పోయారు. బాగుంది. కాని రాజా అంతులేని పగవల్ల కచ్చువల్ల లాభం లేదు. రేపు నాగజాతిలో బ్రాహ్మలను చంపేవాడు పుట్టి పగతీర్చుకోవాలని చూడచ్చు. నీవది గ్రహించాలి రాజా. ఇంకేమీ వద్దు. ఆపను అంటే శపించను. వెళ్లిపోతాను. బాగా ఆలోచించు'' అన్నాడాస్తీకుడు.

''నీవు చెప్పినది సత్యమే ఆస్తీకా. నిన్నూరికే పంపను. అది నా నియమం. యాగం యిప్పుడే ఆపిస్తాను'' అని ఆపించాడు. మూడడుగుల దానం జరగకుండా చేయాలని బలిగురువు శుక్రుడు పురుగై జారి చెంబులో ధారకు అడ్డం బడ్డాడు. మరొక విద్యార్థిని సర్పలత లేచి నవ్వి, '' ఇప్పుడు అలాగే జరుగుతున్నది మేడమ్'' అని కూచున్నది.

''క్లెవర్ అండ్ వైజ్ గాళ్, గుడ్. కొన్ని కీటకాలు కుడితే కొన్ని తల్లో దూరతాయి. హాని చేస్తాయి. వాడితల్లో పురుగు తొలుస్తున్నదంటారు, చెడు ఆలోచనలు చేసేవారిని పేలు తల మూడడుగుల దానం జరగకుండా చేయాలని బలిగురువు శుక్రుడు పురుగై జారి చెంబులో ధారకు అడ్డం బడ్డాడు. మీద స్థావరం యేర్పరచుకొని నిద్రపోనీవు. హాని చేస్తాయి. పేనుకొరుకుడని చర్మం మీద జుట్టు రాకుండా చేస్తాయి. పేనుగుడ్డును యీరి అంటారు. మునుపు యీరి పెన్న అనే దువ్వెనతో యీరి తీసేసేవారు. ఇప్పుడు షాంపూ, మందు

వస్తున్నాయి. దూరదర్శన్ మీద చూస్తాము ప్రకటన. మరొకరి దువ్వెన వాడితే వారికి పేలుంటే వీరి తల్లో చేరుతాయి. వాటిని పడిన పేలు అంటారు. తలలు దగ్గరగా పెట్టినా చేరతాయి. కాని తలమీద పుట్టి పెరిగినవి త్వరగా వదలవు. పేను మీద కథ వున్నది''.

''చిన్నప్పుడు విన్నాం మేడమ్. రాజు మీదికి యుద్ధానికి వెళ్లి, చంపింది రాజును'' అని నవ్వింది టీనేజర్ శశి.

''తల్లో పురుగు తొలుస్తుంటే ఒకరు డబ్బు వెంట పరెగెత్తుతూ నిలువుదోపిడీ చేస్తారు. సంఘానికి హానిచేసే వారిని చీడపురుగులంటారు. మరొకరు స్నేహాన్ని చెడగొట్టి భేదభావం సృష్టించి విడదీస్తారు. ఇళ్లు అమ్మిస్తారు. పాతవి కొనిపించి ప్లాట్సు లేవదీసి అమ్మి లక్షలార్జించని ఆశలేపి పెన్నీలెస్ చేస్తారు'' అంటుండగా గంటమోగింది. అంతా నవ్వుతూ లేచి, '' ఇవాళ పాఠం చాలా బావుంది మేడమ్'' అని బయటికి నడిచారు.